# శిక్ష

తను హంతకుడు! తనే చంపేశాడు అరుణని! చేతులారా చంపాడు, పట్టుమని పాతికేళ్లు నిండని అరుణకి బలవంతంగా ఆయుర్దాయం చెల్లించేశాడు! దీన్నేమంటారు? హత్యగదూ! యీ హత్యకి తనని ఏ న్యాయస్థానమూ శిక్ష విధించదు. విధించలేదు. చేతగాదు వాళ్ళకి. ఎవరూ కనుక్కోలేరు తను చేసిన పని ఒక్క దేవుడు తప్పించి: ఏ శిక్ష అయినా చాలదు!

అరుణా, అరూ .... ఎక్కడున్నావు? ఎక్కడికి వెళ్ళిపోయావు నన్నొదిలి! ఒక్కసారి రా అరుణా! ఒక్కసారి కనిపించి నీ చల్లని చేతుల్తో యీ కాలే మనసుకి శాంతినీయి నువ్వు లేవు. ఎలా వస్తావు? నన్నెలా క్షమిస్తావు? .. నన్ను క్షమించలేవా అరుణా! ఒక్కసారి కనిపించి నన్ను క్షమించానని చెప్పవూ??.... లేదు. నువ్వు రావు. నా మూఢత్వానికి బలి అయిన నీవు యింత త్వరగా నన్ను క్షమిస్తావా?... వద్దు వద్దు, నేను చేసిన పనికి నన్నిలా కుళ్ళి కుళ్ళి ఏడవనీ! ఇలాగే అనుక్షణం, నేను చేసిన పనికి అందరూ ఏహ్యించుకుంటూంటే, నాలో నేను కుములుతూ పశ్చాత్తాపంతో దహించుకు పోనీ. అప్పటికైనా మనశ్శాంతి చిక్కుతుందేమో?"– పిచ్చివాడిలాగా తనలో తను గొణుక్కుంటూ తలగడలో మొహం దాచుకుని పక్కమీద అస్థిరంగా పొర్లుతున్న సారథిని చూసి శారద కళ్ళలో నీరు చిమ్మింది.

"అన్నయ్యా!.... అన్నయ్యా!" జాలిగా పిలిచింది.

"కాస్త మజ్జిగఅన్నం కలిపి తెచ్చాను కొంచెం తినుఅన్నయ్యా!"

విసుగ్గా తల ఆడించాడు సారథి.

"అలాగంటే ఎలాగ, పది రోజులనించి వచ్చి మంచినీళ్ళు ముట్టుకోకుండా పస్తులుంటున్నావు. అసలే నీ ఆరోగ్యం బాగులేదు. మళ్ళీ మొదటికొస్తుంది. దీనంగా అంది శారద.

"నాకేం వద్దు శారదా, నన్నిలా ఒదిలేయండి నాకేం అవదు!" తలగడలోంచి మొహం తీయకుండానే అన్నాడు సారథి.

"మరీ యింత మతి పోగొట్టుకుని, యిలా నిద్రాహారాలు మాని నందువల్ల ఒరిగేదేముంది? ఎంత ఏడిస్తే మాత్రం పోయిన వదిన తిరిగొస్తుందా? అసలే, నీ ఆరోగ్యం బాగులేదు. అమ్మ బెంగ పెట్టుకుంది. నిన్నూ, నీ పరిస్థితినీ చూసి కృంగిపోతూంది. ఈ వృద్ధాప్యంలో ఆవిడని ఇలా బాధపెడతావా?"

"నా కోసం ఎవరూ బాధపడనక్కరలేదు. నా లాంటి వాళ్ళకి యింత త్వరలో ఏం అవదు! నన్నిలా ఓ మూలపడి ఏడవనీయండి! యిలా ఏడిస్తేనయినా కాస్త మనశ్శాంతి లభిస్తుందేమో!" భారంగా అన్నాడు సారథి.

"హుం.... మనశ్శాంతి! యీ మనశ్శాంతికి దూరమయ్యే వదిన నీకు దూరమైంది. అది నీవు ఆనాడు గుర్తిస్తే యింత జరిగేదే కాదు!", యిప్పుడేమనుకుని ఏం లాభం?" శారద నిష్ఠూరంగా అంది.

దెబ్బతిన్నట్టు తలెత్తి చురుగ్గా చూశాడు సారథి. అవును. నిజమే! ఈ జ్ఞానం అప్పుడుండాల్సింది. తనంత మూర్ఖంగా ప్రవర్తించకపోతే అరుణ తనకి దూరమయేదేకాదు! యీ పచ్చి నిజం తను చాలా ఆలస్యంగా గుర్తించాడు!

అరుణని తను ప్రాణప్రదంగా ప్రేమించాడు! అరుణకి తన

మూలంగా ఏ ఆపద సంభవించినా సహించలేననుకున్నాడు! ఆ సమ్మకమే, ఆ మూఢత్వమే తనని దగా చేసింది.

మృదుమంజుల గానంలా సాగిపోతున్న తన జీవనరాగంలో యింత త్వరలో విధి యింత అపశృతి పలికిస్తుందని ఎన్నడూ అనుకోలేదు!

అరుణ యీ అపశృతి భరించ లేక వెళ్ళిపోయింది. ఏరికోరి వివాహం చేసుకుని ఎనిమిది నెలలు అప్యాయనురాగంతో ఆనంద డోలికల్లో ఓల లాడించిన భర్త హఠాత్తుగా ఏ కారణం చెప్పకుండా తన నీడ చూస్తేనే అసహ్యించుకోడం, తన మాట వింటేనే కోపంతో మండిపోవడం తన స్పర్శ సోకితేనే చీదరించుకోవడం భరించలేక పోయింది. కారణం తెలియక దిగులుతో కుమిలిపోయింది.

ఎంతో సహనంతో, ఓర్మితో మూడు నెలలు ఓపిక పట్టింది. కారణం చెప్పి తనని శిక్షించమంది. అకారణంగా తనని యిలా చిత్రవధ చేసేకంటే ఒక్కసారే చంపేయమని, కన్నీళ్ళతో ప్రాధేయపడింది. తనే నేరం చేసి భర్త ఆనందానురాగానికి దూరమయ్యానా అన్న ఆవేదనతో రాత్రింబవళ్ళు కుమిలిపోయింది!

కుమిలిపోయుంటుందని ఇప్పుడు అనుకుంటున్నాడు. ఇప్పుడు తెలిసింది తనకి! అరుణ భరించిన రంపపుకోత యిప్పుడుగాని అర్థంకాలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు అరుణ తనకు దూరమయాకేగాని తను అరుణపట్ల ఎంత క్రూరంగా ప్రవర్తించినదీ అది ఆమె నెంతగా గాయపర్చినదీ తెలిసిరాలేదు.

కన్నీటి పొరలలోంచి, అరుణ రూపం దీనంగా, జాలిగా ప్రాధేయ పడ్తున్నట్టు కనిపించింది, పల్చటి తెరలలోంచి అనేక దృశ్యాలు – తెరలు తెరలుగా కనిపించి తాను చేసిన నేరాన్ని భూతద్దంలో మాదిరి ఎన్నోరెట్లు ఎక్కువచేసి మనసుని పిండుతున్నాయి—

—"ఎన్నిమార్లు చెప్పాను నీకు, ఇవన్నీ చేయవద్దని? వాసుగాడేం చేస్తున్నాడు? ఒక్కసారి చెపితే అర్థం అవాలి! బుద్ధుండాలి! వెళ్ళు యిక్కడ్నుంచి" కోపంతో గట్టిగా అరిచాడతను. తను చేతిలోకి తీసుకున్న కప్పు, టిఫిన్ పళ్ళెం బల్లమీద పెట్టేసి ఎర్రబారిన మొగంతో, నీళ్ళు చిందిన కళ్ళతో ఒక్కసారి తనవైపు చూసి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది అరుణ.

సావిట్లో కూర్చున్న శారద నెమ్మదిగా అడుగుతూంది "ఎందుకు వదినా అన్నయ్య అలా కేకలు వేస్తున్నాడు? మళ్ళీ ఏం అయింది?

"ఏముంది అవడానికి. రోజూ అన్నింటికీ ఏదో గొడవే! ఆయనకి బొత్తిగా నా పొడే గిట్టకుండా వుంది. గదిలో ఫలహారం పళ్ళెం, కాఫీ కప్పు వుండిపోతే తేవడానికి వెళ్ళాను. అంతే ఖస్సుమంటూ...." పట్టుకున్న గొంతుతో అస్పష్టంగా అంటూంది అరుణ.

"ఊఁ.... బాగుంది, రోజు రోజుకి మరీ ఎక్కువయిపోతూంది వీడి కోపం. పిచ్చిగాని యెక్కలేదుగదా వీడికి! అయినా నీ వెందుకు అలా వాడిచేత చీవాట్లు తినడం? అన్నయ్య పిలుస్తేనేగాని వెళ్ళకసలు.... అప్పుడు తెలుస్తుంది!" కోపంగా అంది శారద.

"ఎలా వూరుకుంటాను అలా చూస్తూ! ... అంటీ అంటనట్లు అలా వూరుకోడానికి మనసెలా వప్పుతుంది? వెళ్ళకుండా ఎలా వూరుకో గలను? ... నీకూ తెలుస్తుంది నీ పెళ్ళయితే!" అంది పిచ్చి అరుణ. తనంటే ఎంత అభిమానం!

నవ్వింది శారద. "అవుననుకో. కానీ ఏం చెయ్యడం? వాడలా దగ్గరకి వస్తేనే కసురుకుంటుంటే ఏం చేస్తావు? వెళ్ళి వాడిచేత యింకొంచెం తిట్లు తినడం ఎందుకు చెప్పు?"

"ఏం అయింది ఆయనకి? నాకేం అర్థంకావడంలేదు ఆయన సంగతి. ఎందుకిలా మారిపోయారు! నేనేం చేశాను? నా తప్పేమిటో అర్థంకావడంలేదు" దీనంగా అంది అరుణ.

ఇంకోసారి —

"నాకోసం భోజనానికి కాచుకు కూర్చోవద్దని ఎన్నిమార్లు చెప్పినా వినవేం? నా యిష్టంవచ్చినపుడు వస్తాను. నా యిష్టంవచ్చినపుడు తింటాను. నాగదిలో తింటాను పెట్టమనిచెప్తే ఎందుకు వినవు? ఎందుకింత నిర్లక్ష్యం నామాట అంటే?" మధ్యాహ్నం ఆఫీసునించి వచ్చి, వంటింట్లో రెండు కంచాల్లో వడ్డిస్తున్న అరుణని చూస్తూ తీక్షణంగా అన్నాడు తను. తన అకారణ కోపానికి పాపం బిత్తరపోయి చూసింది అరుణ. సావిట్లో గుమ్మం దగ్గిర కూర్చుని వత్తులు చేసుకుంటున్న తల్లి కోడలి తరుపున కలగచేసికోక తప్పలేదు.

"ఏమిటిరా నీ గొడవ? నువ్వు తినకముందే అదెలా తినేసి కూర్చుంటుంది? గుమ్మంలోకి వచ్చిందగ్గిరనుంచి ఎందుకలా రుసరుస లాడ్తావు? రోజు రోజుకి మరీ రాక్షసుడవై పోతున్నావు. అకారణంగా ఎందుకలా కసురుతావు దాన్ని? ఏమయింది, నీకీమధ్య?" కాస్త గట్టి గానే అడిగింది అమ్మ.

"ఏమిటమ్మా, నువ్వు మరీను. నేను తినకముందు తినకూడదని ఏమైనా రూలుందేమిటి? "రోజుకో టైముకి వస్తాను. నాకోసం ఎందుకు కాచుకోవడం. నా బల్లమీద పెట్టేస్తే, నాయిష్టం వచ్చినపుడు తింటాను" అని యిప్పటికి రెండు మూడుసార్లు చెప్పినా తను ఎందుకు వినదు? తన కెందుకింత పట్టుపల? యిలాగైతే అసలు మధ్యాహ్నం యింటికేరాను. ఆఫీసుకే పంపండి భోజనం." మౌనంగా నేలచూపులు చూస్తున్న అరుణని తీక్షణంగా చూస్తూ అన్నాడు.

"ఇదివరకల్లా వెళ్ళిన ఆఫీసుగాదా! యిదివరకు చేసిన పనిగాదా! యిదివరకల్లా యిద్దరూ కలసి తినలేదా! యిలా తయారవుతున్నా వేమిటీ రోజు రోజుకీ! నీ సంగతేం అర్థం అవకుండా వుంది" అమ్మ చివాట్లు పెట్టింది.

"ఏమిటన్నయ్యా! యిదివరకు వదిన ప్రక్కన లేందే అన్నం

సయించదనే వాడివి. వదినే అన్నం పెట్టాలనే వాడివి. యిప్పుడేమిటి యిలా ప్లేటు ఫిరాయించావు?" నవ్వుతూనే అడిగింది శారద.

తనకి కోపం, చిరాకు వచ్చాయి, ఏం జవాబు చెప్పలేని అసహాయత్వంతో కోపంగా "నాకేం అవలేదు మీరే అందరూ నన్ననవసరంగా విసిగిస్తున్నారు....ఊఁ....వెళ్ళు నాగదిలో తెచ్చిపెట్టి .. నువ్వెళ్ళి తిను" అరుణని ఉద్దేశించి గబగబ అని గదిలోకి వెళ్ళిపోయాడు తాను.

"వెళ్ళమ్మా .... వెళ్ళు ... వాడన్నట్లేగానీ, లేకపోతే అసలే మానేస్తానంటాడు. మూర్ఖుడై పోతున్నాడు రోజురోజుకీ, అమ్మ చెప్పింది.

ఖిన్నురాలై తలవంచుకుని, మౌనంగా వడ్డించిన కంచం తీసుకొచ్చి గదిలో పెట్టి ఒక్కసారి తనవంకచూసి వెళ్ళిపోయింది అరుణ. అరుణ కళ్ళలోని దీనత్వం చూసిన తన మనస్సు మూలిగింది. ఏనాడైనా పెళ్ళి అయాక అరుణ ప్రక్కనలేనిదే అన్నం తిన్నాడా?" అమ్మని, శారదని ముందు తినేయమను, మనిద్దరం సర్దాగా కలసి తిందాం" అంటూ ఆమెనే కలిపి పెట్టమని, చంటిపాపలా మారాంచేస్తూ అరుణని విసిగిస్తూ, ఆమె విసుక్కుంటూంటే తనకి ముచ్చట! అలాంటి దీనాడు తన ప్రవర్తన ఆమె నెంతగా కాల్చిందో!

యింకోరోజు సాయంత్రం హుషారుగా యింటికి వచ్చిన తనని చూసి అరుణ, శారద యిద్దరూ ఆశ్చర్యపోయారు. అరుణ మొహంలో సంతోషం నీడలా మెదిలింది.

"అరుణా, మంచి పిక్చరు వచ్చింది. టిక్కట్లు తెచ్చాను త్వరగా తయారవండి"

"హమ్మయ్య! నెలరోజులపైన అయింది సినిమాకెళ్ళి! బోరు కొడ్తోంది. పద అన్నయ్యా. త్వరగా తయారవు వదినా!" శారద ఉత్సాహంగా అంది.

"నేను రానమ్మా, నాకు పనుంది. మీ రిద్దరూ వెళ్ళండి" నెమ్మదిగా అన్నాడు తాను.

"అరుణ మొహంలో కాంతి ఒక్కసారి తగ్గింది. శారదతెల్లబోయి, తనవంక చూసింది" "అదేమిటన్నయ్యా! నువ్వు రాకుండానా? ఏం బాగుంటుంది? యిద్దరం ఎలా వెళతాం?" నిరుత్సాహంగా అంది.

"ఏం. నేను రాకపోతేనేం? నాకు క్లబ్బులో మీటింగు వుంది. మిమ్మల్ని పిక్చర్ దగ్గర డ్రాప్ చేస్తాను. కానివ్వండి, క్విక్ ...." తొందర పెట్టాడు తను.

"వద్దు నేను వెళ్ళను" అరుణ పొడిగా అని వెనకకు తిరిగి వెళ్ళబోయింది.

"అరుణా!" కఠినంగా పిల్చాడు. వెడుతున్న అరుణ ఆగింది.

"ఏం ఎందుకు వెళ్ళవు?" తీక్షణంగా అడిగాడు.

"నాకు వెళ్ళాలనిలేదు. నేను వెళ్ళను. మీరు రాకుండా వెళ్ళను" అంది అరుణ అటుతిరిగే.

"ఓహోహో! యిదంతా పతిభక్తి కాబోలు. నేను రాకుండా వెళ్ళదుట! చాలా రోజులయింది, పోనీగదా వెడతారని వెళ్ళమంటే! .. అంతే. నీ ఖర్మం నేనేం చేస్తాను? ఇంట్లోనే పడివుండండి ... ఛీ, సరదాల్లేని మనుషులు" కోపంగా విసవిస గదిలోకి వెళ్ళిపోయాడు తను.

"అవును ... సరదాల్లేని మనిషినే! నన్నిలా తయారు చేస్తున్నది ఎవరూ? నేనేమైనా సినిమాలడిగానా, నాటకాలడిగానా? ఆయనకి నాతో రావడం యిష్టం లేనప్పుడు, అసలు ఆ ప్రసక్తి తేవటం ఎందుకూ? నన్నెలా చిన్నబుచ్చడమా, అవమానించడమా అని చూస్తుంటారు. నేనెంత ఏడిస్తే అంత ఆనందంగాబోలు! లేకపోతే ఎందుకిలా అడగడం? నేనెన్నడైనా ఆయన లేకుండా ఎక్కడికైనా వెళ్ళానా? ఇంతకూ నాకు కావల్సింది సినిమాలా? ఒక ప్రక్క నేనంటే అంత మహా ప్రేమవున్నట్లు నీవు తినకపోతే – నేను తినను. సరదాగా సినిమాకెళ్ళు ... అనడం ఎందుకు? నిజంగా నా సుఖసంతోషాలే కావల్సిన మనిషయితే

నన్నెందుకిలా ఏకిపించడం ? ఎందుకిలా దూరంచేసి క్షోభపెట్టడం ? ఏమిటీ నాటకం ? ఏమయింది ఆయనకి ?" ఆవేశంగా ఆవేదనతో మనసులోని బాధ వెళ్ళగ్రక్కింది అరుణ. ఎన్నడూ నాలుగు మాటల కంటే మాట్లాడని అరుణ !

"అన్నయ్యకి నిజంగా పనుందేమో ? పోనీ మనం వెడదాం పద వదినా, లేకపోతే అన్నయ్యకి కోపం వస్తుంది" అంటూంది శారద.

"నీకు తెలీదు శారదా వారికి నాతో రావడం, నేను ప్రక్కనుండడం ఆఖరికి నన్ను చూడటంకూడా యిష్టంలేదు. అందుకే యిలా ఏవో వంకలు పెట్టి నాకు దూరంగా వుంటున్నారు. అంత ఏహ్యించుకునేందుకు నేనేం అపరాధం చేశాను ?" ఆమె కంఠం వణుకుతోంది.

అంతా వింటున్న తనకి ఎదురుగా వెళ్ళి నచ్చజెప్పి, పరిస్థితి వివరించగల శక్తి లేకపోయింది అప్పుడే మూడు నెలలు అవుతూంది. యింకా రెండు మూడు నెలలు ఎలాగో గడిపితే ! .. ఆ తర్వాత మళ్ళీ పాతరోజులు చూడవచ్చు !

ఆ రోజు సరిగ్గా మూడు నెలల క్రిందట మొదటిసారిగా తన ప్రవర్తనచూసి అరుణ ఎంత బాధపడింది ! మామూలుగా తనకి టైకట్టి, బూట్లు అందించి, వీధిలో నిలబడి టా టా చెప్పి ఆఫీసుకి పంపింది అరుణ. వెళ్ళిన రెండు గంటలలోనే యింటికి తిరిగివచ్చి ప్రక్కమీద వాలిపోయాడు తను.

వంటింట్లో అయ్యరుకి కూరలు తరిగిస్తున్న అరుణ ఆత్రుతగా గదిలోకి వచ్చింది. "అదేమిటి అప్పుడే వచ్చేశారు, ఒంట్లో బాగులేదా ?" అంటూ ప్రక్కన కూర్చుని తనవైపు తిప్పుకుంది. వెంటనే ఆశ్చర్యపోతూ "అదేమిటి మొహం అలా వాడిపోయింది ? కళ్ళెర్రబడ్డాయి వెళ్ళేటప్పుడు బాగానే వున్నారు. ఇంతలోనే ఇలా అయిపోయారేమిటి ?" ఆందోళనగా కలవరపడ్తూ ప్రశ్నలు కురిపిస్తున్న అరుణని చూసి ఏదో చెప్పాలనుకుని నోరు తెరిచాడు, అంతలోనే మానుకున్నాడు.

"ఏం లేదు, కొంచెం పడుకుంటే అదే పోతుంది" అంటూ నుదురు చిట్లించి, చిరాగ్గా వదిలించుకోబోయాడు.

"అయితే తలగాయనా, మాత్ర యీయనా?" అంటూ లేచిన అరుణని విసుగ్గా విదిలించాడు. అబ్బ .. ఏం అఖ్ఖరలేదు, నువ్వు వెళుదూ ఇక్కడనించి .

అరుణ ఆశ్చర్యంగా చూసింది నమ్మలేనట్టు. "ఏం అంత చిరాగ్గా వున్నారు? ఏమయింది? ఏమయినా ఆఫీసుగొడవలా? నిజంగానే వంట్లో బాగులేదా? డాక్టరుకి ఫోన్ చేయనా?" లాలింపుగా క్రాపు సవరిస్తూ అడిగింది.

"నాకేం అవలేదు. ముందు నీవిక్కడనుంచి వెడితే అన్నీ పోతాయి నా ప్రాణం తీయక. కాసేపు అవతలికివెళ్ళు" తరుణచేయి త్రోసేస్తూ కఠినంగా అన్నాడు. అరుణ దెబ్బతిన్నట్టు చూసి "చిన్నపుచ్చుకుని, తలవంచుకు వెళ్ళిపోయింది" అదే మొదటిసారి అలా దురుసుగా ప్రవర్తించడం. అందుకే అరుణ బాధకంటె, ఎక్కువ ఆశ్చర్యపోయినట్టు కనిపించింది. అసలు ఎప్పుడైనా కాస్తవంట్లో బాగులేకపోతే చాలు నానా హడావిడిచేసి, అనుక్షణం అరుణని కళ్ళముందు వుండాలంటూ, అరుణకి ఊపిరాడనంత గాభరా పెట్టేవాడు. అలాంటి ఈనాటి తన ప్రవర్తనకి అరుణ ఆశ్చర్యపడడంలో వింతలేదు. ఆ రాత్రివరకుకూడ అరుణ కాఫీతెచ్చి ఇచ్చినాకూడ కసిరాడు. కాళ్ళుపట్టనా, డాక్టరుని పిలవనా, అన్న అన్ని ప్రశ్నలకి తెచ్చిపెట్టుకొన్న కోపంతో, కఠినంగా మాట్లాడి అరుణని దగ్గరికి రానీయలేదు.

— మామూలుగా రాత్రి పడుకోడానికి వచ్చిన అరుణనిచూసి ఏం చెప్పాలో తెలియక కాసేపు ఇబ్బంది పడ్డాడు. ఆఖరికి ఆమెవంక చూడకుండానే "అరుణా, ఇవాల్టికి పక్క గెస్టు రూమ్‌లో పడుకో, నాకు చిరాగ్గా వుంది. ఒంటరిగా పడుకుంటాను ఐ వాంట్ రెస్టు" బలవంతంగా వడిగా నవ్వాడు. అరుణ తెల్లబోయి చూసింది. వెంటనే ముఖంలో

రంగులు మారాయి. "ఎందుకివాళ ఇలా మాట్లాడుతున్నారు ? ఏం జరిగింది ? నిజం చెప్పండి. ఎందుకిలా వున్నారు ?" దగ్గిరకివచ్చి గడ్డం పట్టుకొని తనవైపు తిప్పుకుని కళ్ళలోకి పరీక్షగా చూసింది. ఆ కళ్ళలో ఆవేదనచూసి తడబడ్డాడు .... కాని ... కాని ...

"ఏమిటి నీ గోల నా వంట్లో బాగులేదు, చికాగ్గా వుంది. ఇంకా ఎందుకు విసిగిస్తావు ? విశ్రాంతి కావాలి – అంటూంటే అర్థం అవదూ ? చెప్పినట్టు చేస్తావా ? లేక నన్నే వెళ్ళిపొమ్మంటావా ?" బలవంతంగా అరుణని విదిల్చి అటు తిరిగిపోయాడు తను. తిరిగి చూడకపోయినా అరుణ మనస్థితిని అర్థం చేసికోగలడు !

అది మొదలు ఈ నాటివరకూ అరుణని దూరంగా వుంచాడు.

ఎన్నిమార్లు, ఎన్ని విధాలుగానో కారణం తెలిసికోడానికి ప్రయత్నిం చేది అరుణ. అరుణకి మాట్లాడడానికి అవకాశం ఈయకుండానే, ఆ సంభాషణ మెదలు పెట్టగానే, కోపంతో మండిపడుతూ, పరుషంగా మాట్లాడి అమెని చిన్నబుచ్చి ... ఆమె అంతట ఆమె తననించి దూరం కావాలని చూశాడు ... కాని ....

ఆ రాత్రి ! ఆఖరి రాత్రి ! తన జీవితంలో వెలుగు శాశ్వతంగా అస్తమించిన రాత్రి !

అర్థరాత్రి ... అందరూ నిద్రపోయే సమయం. నిద్రలో వున్న తను. తలుపులు చప్పుడవడంతో లేచి తలుపులు తెరిచాడు. తలుపులు తీసిన వెంటనే సుడిగాలిలా వచ్చి ఆశ్చర్యంలో, సగం నిద్రలో వుత్తగా చూస్తున్న తన గుండెలమీదవాలి వెక్కి వెక్కి ఏడవసాగింది అరుణ. అ స్థితిలో అరుణని చూసి తనని తను మరచిపోయాడు. మూడు నెలలుగా బిగించి వుంచిన కళ్ళాలు తెగిపోయాయి. ఒక్కసారిగా అరుణని గాఢంగా హత్తుకుని, ఆప్యాయంగా తల నిమురుతూ వుండిపోయాడు. ఇద్దరూ అలా ఎన్ని నిమిషాలు వున్నారు ! తనలోని మార్పుకి ఆశ్చర్య పడిపట్టుగా తలెత్తి తన కళ్ళలోకి ఆనందాశ్చర్యాలు మిళితమవగా

చూసింది. ఆ కొద్దిపాటి కాంతిలోనే అరుణ కళ్ళు వింతగా మెరవడం చూశాడు తను. అంతే!

ఒక్కసారిగా మెళకువవచ్చింది. గాభరాగా అరుణనించి తప్పించుకున్నాడు. ఆమె చేతులు తన మెడచుట్టూ నించి బలంగా తొలగించాడు. దెబ్బతిన్నట్టు చూసింది అరుణ. దూరంగా తొలగి అటు తిరిగి నుంచున్న తన వైపు వచ్చి కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూ, "చెప్పండి ఇవాళ అసలు సంగతి చెప్పండి! ఎందుకిలా మారిపోయారు? ఎందుకు నన్నిలా చిత్రహింస పెడుతున్నారు? నేనేం తప్పుచేశాను. ఏ కారణం చెప్పకుండా నన్నెందుకిలా క్షోభ పెడతారు? నన్నెందుకిలా దూరంగా వుంచుతున్నారు? న్నారు? యివాళ యింక తప్పించుకోలేరు. చెప్పండి" తనని పట్టుకుని ఆవేశంగా అంది.

"అరుణా ఏమిటిది? వదులు, ఏమిటి చెప్పమంటావు? నేనేం మారిపోయాను? నిన్నేం బాధపెడ్తున్నాను? ఎందుకీ ఏడుపు?" అరుణ భుజం మీద చెయ్యేసి శాంతపర్చటానికి సౌమ్యంగా అన్నాడు.

"చాలు, ఆపండి. ఎందుకు నన్నింకా మోసం చెయ్యాలని చూస్తారు?"

మీ మనసులో మాట చెప్పండి ఏదయినా సరే! నేనేం అనుకోను, మిమ్మల్ని తప్పు పట్టను. నేనేం చేశానని నామీద యింత కోపం? ఏమయిపోయాయి మీ యిదివరకటి ప్రేమ కబుర్లన్నీ? అన్నీ ఉత్తి గాలి మూటలేనా? పెళ్ళయి ఏడాదికూడా తిరక్కుండానే నామీద యింత విముఖత్వం కలగడానికి ఏమిటి కారణం? చెప్పండి? చెప్పందే నే నివాళ యిక్కడ్నుంచి కదలను. చెప్పితీరాలి." మొండిగా కళ్ళలోకి చూస్తూ ఏదో నిర్ణయించుకున్నదానిలా అంది.

ఆ ధోరణి చూసి తడబడ్డాడు. ఎలా సమాధాన పర్చాలో, ఏమని చెప్పాలో ఒక పట్టాన అంతుపట్టలేదు.

"ఏమిటి అరుణా, నీకేమైనా పిచ్చా ? అర్ధరాత్రి ఏమిటీ గొడవ ? ఏ కారణం లేనిదే ఏం చెప్పమంటావు ?"

"చాలించండి ! ఈ నాటకం.... ఏం లేనిదే నన్నెందుకు యిలా దూరంగా వుంచుతున్నారు ! " గొంతు జీరపోయింది.

"అరుణా వెళ్ళి పడుకో ! అనవసరంగా అపోహపడి బాధపడకు వెళ్ళు."

"ఎంత మారిపోయారు మీరు ? ఏమయింది మీకు ఒక్కసారిగా యింతమార్పు యెందుకు వచ్చింది ? ఎంత ఆదరానురాగాలు చూపేవారు? ఎంత ఆనందంతో కడిపాం యెనిమిది నెలలు ! డాబా మీద యెన్ని వెన్నెల రాత్రాలు నా వళ్ళో తల పెట్టుకుని ప్రేమగా ఆవేశంగా దగ్గిరికి లాక్కొని "అరుణా ! నా చీకటి జీవితానికి అరుణకాంతిని ప్రసాదించిన అరుణవు. నిన్ను పొందడం నా అదృష్టం. అన్నీ వున్నా నీలాంటి భార్యని పొందగలగడం నా భాగ్యం" అని పొగడ్తలతో తబ్బిబ్బుచేసిన మీరేనా, యిలా .... చీడపురుగును విదల్చినట్టు విదిలిస్తున్నారు? ... ఆ మాటలన్నీ మరచిపోయారా ? లేక ఆ అరుణ చచ్చిపోయిందనుకున్నారా ? లేక యింకెవరైనా మీ మనసులో చోటుచేసుకున్నారా ? లేక నా మీద ఎవరన్నా అనుమానాలు కలిగించారా ? అరుణ కంఠం వణికింది.

"అరుణా ! గెటవుట్ ! ఏమిటీ అసందర్భంవాగుడు !" జవాబు చెప్పలేని అసహాయత్వంతో కసిరాడు కోపంగా.

అరుణ ఆ కంఠంలోని కాఠిన్యం చూసి రెండు నిమిషాలు అసహాయంగా, ఆశక్తగా చూసింది.

"అంతేనా !" జాలిగా హీనస్వరంతో అంది. కళ్ళ నీళ్ళు జారాయి, ఆ శోకమూర్తిని చూసి తన గుండె కదలింది. ఆమెనిబలంగా గుండెలకి హత్తుకుని, కన్నీళ్ళని తుడిచి, లాలించాలని మనసు ఉద్రేక

పడింది. "అరుణా ఎలా చెప్పను? నేను అశక్తుడిని! నన్ను అర్థం చేసుకో, బలవంతం చేయకు!" అని చెప్పాలనుకున్నాడు. కాని ......

వెల్లువకి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ బయటికి వెళ్ళి పోయింది అరుణ.

మర్నాడు చాలా ఆలస్యంగా లేచాడు. ఆ రాత్రంతా నిద్రలేక తను హఠాత్తుగా ఏవో కేకలతో గలాటాతో ఉలిక్కిపడి లేచి గాభరాగా బయటికి వచ్చాడు.

గదిలో గుమిగూడిన అందర్నీ తప్పించుకుని చూశాడు. నిశ్చేష్టుడై పోయాడు! అరుణ! ... అరుణ మంచంమీద నిశ్చలంగా, నిర్జీవంగా పడివుంది!

తన సర్వస్వం ధారపోయడానికి ఆరాటపడ్డా ప్రయోజనం లేక పోయింది! చాలా ఆలస్యం అయిపోయింది! అరుణని దక్కించుకో లేక పోయాడు! నిద్రమాత్రలు తిని చనిపోయిందని డాక్టరు తేల్చాడు.

"నేనే తెచ్చి ఇచ్చాను డాక్టరు దగ్గర్నుంచి. వదిన రోజూ నిద్ర పట్టక బాధ పడుతూంటే, ఆహారం, నిద్ర, మనశ్శాంతి లేక బాధ పడుతూ ఆరోగ్యం పాడు చేసుకుంటూంటే, వదిన అడిగితే తెచ్చి యిచ్చాను. ... ముందే ఆలోచించుకుని అడిగిందని ... శారద దుఃఖంతో మాట్లాడ లేక పోయింది.

"దాని ప్రాణం విసిగిపోయింది! దాని మనసు విసిగిపోయింది. నీ మాటలతో. నీ చేష్టలతో దాన్ని కాల్చుకుతిన్నావు! ఓపిక పట్ట గలిగినన్నాళ్ళు పట్టింది! ఓర్మితో, సహనంతో నీ రాక్షసత్వం అంతా సహించింది. నీలో మార్పుకి ఎదురు చూచింది. ఏ కారణం తెలియక రాత్రింబగళ్ళు దిగులుతో కుమిలిపోయింది. మనశ్శాంతిలేక అలమటించింది. ... ఆఖరికి ఈ చిత్రహింస భరించలేక యీ నరకంనుంచి విముక్తికోసం హాయిగా శాంతి దొరికేచోటుకి వెళ్ళిపోయింది! దీనికంతకీ ఎవరు

కారణం! నీవే, నీవే. నీవేరా! ఎందుకేడుస్తావు యింకా, పాతికేళ్ళు నిండని పసికందుని బలిపెట్టుకున్నావు ! యింక ఆనందించు ! సుఖపడు!" అమ్మ దుఃఖంతో మాట్లాడలేక పోయింది.

తనని చూసి ఎవరికీ సానుభూతిలేదు. తనకి కలిగి కష్టానికి ఎవరూ — ఆఖరికి అమ్మా. చెల్లెలుకూడా తనని ఓదార్చకపోగా తను చేసిన పనికి ఏహ్యించుకుని, ఆఖరికి తనే హంతకుడికింద జమకట్టారు.

—" పూలల్లోవుంచి ప్రాణంగా చూశారు మీరు ! మీ సాహచర్యంలో వెన్నెలనే ఎరిగిన నేను ఈ నాడు యింత చీకటిని భరించలేక పోతున్నాను. మీ అమృత హృదయాన్నే చవిచూసిన నేను ఇంతటి కాఠిన్యాన్ని సహించలేక పోతున్నాను. ఒక్క ఎనిమిది నెలలు ఎక్కడో ఆకాశంలో మబ్బులలో తేలించిన మీరు యిలా భరించలేని ముళ్ళదొంకల మీద పడేసి లాగుతుంటే — ఈ కాఠిన్యాన్ని సహించలేక పోతున్నాను. అన్నీ తిరిగి సర్దుకుంటాయని, తిరిగి మీరు నా వారవుతారని, ఎంతో ఆశతో నిరీక్షించాను ప్రతిరోజు, ప్రతిక్షణం ? కాని, రోజులు గడిచిన కొద్దీ నా ఆశ కొడిగట్టి కృంగిపోయింది. ఇంక ఎందుకు బ్రతకాలి? ఎవరికోసం? నా అవసరం, నా ఉనికి మీకు పట్టనప్పుడు బ్రతడం ఎందుకోసం ? మీరు పడేసిన తిండి తింటూ జీవచ్ఛవంలాగ, యీ బ్రతుకు ఎన్నాళ్ళని యీడ్చను ? ప్రాణాలు పోయేముందు కూడ నా కొక్కటే బాధిస్తుంది - ఏ తప్పుచేసి మీ ఆదరాను రాగాలకి దూరమయ్యానా అన్న వేదనే పీడిస్తుంది. నా తప్పు చెప్పి మీరే శిక్ష విధించినా సంతోషంగా భరించేదాన్ని. పోనీండి, నేను మీ జీవితంలోంచి నిష్క్రమించాకయినా మీరు మామూలు మనిషవుతారని. యిక తర్వాత రాబోయే ఏ అమాయకురాలి జీవితంతోనూ యిలా చెలగాటము ఆడరని ఆశిస్తూ, మీ సుఖ సంతోషాలు కోరుతూ దూరంగా యింక ఎన్నడూ మిమ్మల్ని విసగించనంత దూరంగా వెళ్ళిపోతున్నాను. సెలవు —

అప్పటి కెన్నిసార్లు చదివాడో ఆ వుత్తరాన్ని. ఆ మాటలు అతన్ని పెట్టే రంపపు కోతకి, కావాలని మళ్ళీ మళ్ళీ గురి చేసుకున్నాడు. అరుణ

చనిపోయిన దానికంటే అరుణ ఎంతటి మనోవేదనతో, ఎంతటి అశాంతితో చనిపోయిందో తల్చుకుంటే మనసు పిండేది।

"అరుణా। నీకెలా తెలుస్తుంది? నీ మీద నా ప్రేమే నన్నిలా దూరం చేసిందని। నువ్వు నా ప్రాణంకన్న ఎక్కువనీ, నీకే ముప్పు నా నుంచి రాకూడదనే ఆదుర్దాతోనే, యీ గుండె రాయిచేసు కుని పశువులాగ ప్రవర్తించానని ఎలా తెలుస్తుంది నీ కింక। .... నీ మంచి కోసమే నిన్నుదూరంగా వుంచానని నీకెవరు చెపుతారు ఇప్పుడు? అరుణా .. అరూ, నీకుతెలియదు .. నాకు టి. బి. అరూ। క్షయ। తెలుసా। జ్ఞాపకం లేదా? ఎన్నోసార్లు అనే దానివి "అలా అస్తమాను దగ్గుతూ, మందులు వేసుకోరేమిటి" అంటూ ఏవో సిరప్‌లు త్రాగించే దానివి. సాయంత్రం అయేసరికి జ్వరం తగిలి చికాకుగా ఉన్నా ఏదో మామూలు అలసట అనుకుని నీ సాన్నిధ్యంలో అంతా మరిచేవాడిని, ఆ రోజు .... యధాలాపంగా డాక్టరు దగ్గిఱకి వెళ్ళిన నేను, నన్ను పరీక్షించిన డాక్టరు ఇద్దరం నిశ్చేష్టుల మయ్యాం, ఎక్స్‌రే రిజల్టు చూసి। ప్రధమ దశ దాటిపోతూందని హెచ్చరించి, ఇన్నాళ్ళు నా నిర్లక్ష్యానికి చివాట్లు పెట్టాడు.

ఆ రోజు ఆఫీసునుంచి త్వరగా వచ్చేసిన నన్ను చూసి గాభరా పడ్డావు. ఆందోళన పడ్డావు। నిజంగా నాకు క్షయరోగం అని చెప్తే నీవు నన్నొదిలి దూరంగా ఉండేదానివా? నాకు మరింత చేరువయి, నా సేవలో నిన్ను నువ్వు మరిచే దానివి। యీ రోగం నా ద్వారా నీకు సంక్రమించడం, నువ్వు శుష్కించడం నేను చూడ లేను। .... డాక్టరు ఆశపెట్టాడు కొన్ని నెలల్లో కుదర్చగలనని। ఆ కొన్ని నెలలు నిన్ను దూరంగా ఉంచితే। .... నీ అంతట నువ్వు నాకు దూరంగా ఉండేటట్లు ప్రవర్తించ గలిగితే? .... అనునయంగా నిన్ను దూరంగా వుంచడం కష్టం అని నాకు తెలుసు। అందుకే .... యిలా కఠినంగా ప్రవర్తించి నిన్ను దూరం చేశాను। పశువులా ప్రవర్తించాను ..

అరుణా। నిన్ను దూరంగా వుంచడానికి ఎంత తంటాలు పడ్డాను,

నీతో పాటు భోజనం చేస్తే, నీవు నేను తిన్న పళ్ళేలు అవి ముట్టుకుంటే నా రోగం యెక్కడ తగులుతుందో అని భయం ? ఆఖరికి నీ దగ్గిర కూర్చుని ఆప్యాయంగా మాట్లాడితే ఆ చనువు పురస్కరించుకుని తిరిగి నా చేరువవుతావని నీ నీడ సోకితేనే చీదరించు కున్నట్లు నటించే వాడిని ? ఇవన్నీ నీకెలా తెలుస్తాయి ఇప్పుడు!? దానికి నా హృదయం ఎంత కుమిలి పోయేదీ, నిన్ను పరుష వాక్యాలతో నొప్పిస్తున్నప్పుడు నా మనసు ఎలా బాధ పడేదీ ఇప్పుడెవరితో చెప్పను ?

కొన్ని నెలలు నిన్ను దూరంగా వుంచితే, నిన్ను కాపాడుకో గల ననుకున్నాను ! తిరిగి పాతరోజులు చూడవచ్చుననుకున్నాను.

కాని .... నా అంచనాలు పొరపాటయ్యాయి అరుణా! మూర్ఖుడిలా ప్రవర్తించాను ! నిజంగా మూర్ఖుడినై నిన్ను పోగొట్టుకున్నాను. నన్ను అసహ్యించుకోడం మాని నిన్ను నీవు అనుమానించుకున్నావు. చివరికి నా ప్రవర్తన నేను సమర్థించుకోడానికి అవకాశం ఈయకుండానే అన్యాయంచేసి వెళ్ళిపోయావు, నా నిర్దోషిత్వం నిరూపించుకోడానికి తావీయలేదు.

ఎంత తొందర పడ్డావు అరుణా ! నీవు నన్ను విడిచి ఇంత సులభంగా వెళ్ళిపోతావని వెళ్ళిపోగలవని ఊహించలేని మూర్ఖుడినైనాను? అందరి దృష్టిలో నన్ను దోషిని చేశావు , అరుణా నీవు నన్ను వదిలి పోయినందుకు పడే ఆవేదనకన్నా నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోలేని అసమర్థతే నన్నెక్కువ బాధిస్తుంది. నీ వెంత అశాంతితో చనిపోయావో తలుసుకుంటుంటె మనసు పిండినట్లవుతూంది. ఇదే నీవు మామూలుగా చనిపోతే ఇంత బాధపడే వాడిని కానేమొ ! నేనింత మూర్ఖుడిని, తెలివి తక్కువ వాడిని ఎలా అయిపోయాను ! నా నోట అసలు సంగతి విన్న అమ్మ, శారద నిర్ఘాంతపోయారు. నా ఆరోగ్యానికి బాధపడడం అటుంచి, ఇంత చిన్న విషయానికి ఇంత మూర్ఖత్వంగా ప్రవర్తించి చేతులారా నిన్ను పోగొట్టుకున్న నా తెలివి హీనతని ఇద్దరూ ఆమోదించలేక పోయారు

"చెపితే అర్థం చేసుకోలేని మూర్ఖురాలా అరుణా ! ఎంతపని చేశావు !" అని అమ్మ వాపోయింది.

"అన్నయ్యా, ఓర్మికైనా, సహనానికైనా హద్దుందని గుర్తించ లేక పోయావా? తెగేవరకు లాగకూడదన్న" సామెత ఐనా గుర్తు రాలేదా ? అంది శారద. ఏం లాభం ?" ఎవరెన్ని విధాల నా తెలివి తక్కువని వ్రేలెత్తి చూపినా ఏం ప్రయోజనం ? ఇప్పుడు నీకు అసలు సంగతి తెలి యనే తెలియదుగా ?

"అరుణా ! ఎంతపని చేశావు ? ఎంత తొందర పడ్డావు !.... నన్ను నే నెన్నటికీ క్షమించుకోలేని పరిస్థితిలో యీ జీవితాంతం మనశ్శాంతిలేక నీ నీడే నన్ను వెంటాడేటట్టు చేసి.. ?"

సారధి కన్నీటితో తలగడ తడిసిపోసాగింది.... అతని కదే శిక్ష అన్నట్టు నిర్లిప్తంగా చూసింది ఎదురుగ్గా అరుణ ఫొటో

—o—